క్లుప్తంగా

స్పందన కార్యక్రమానికి హాజరు కావాలి

పుల్లలచెరువు: సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని మండల తహశీల్దార్ కే వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై మండలంలో పనిచేస్తున్న ప్రతి అధికారి స్పందన కార్యక్రమంలో పాల్గొనాలని, ఆ శాఖకు సంబంధించిన వివరాలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కిందిస్థాయి సిబ్బందిని పంపవద్దని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికీ హెల్మెట్ తప్పనిసరి

పుల్లలచెరువు: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఎస్సై సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం పుల్లలచెరువులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వాహనదారులతో మాట్లాడుతూ.. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల మేరకు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగంతో ప్రయాణం చేయడం ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. అనవసరంగా ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రవణమ్మ

మద్దిపాడు:మండల పరిధిలోని నేలటూరివారిపాలెం, గురవారెడ్డిపాలెం జంట గ్రామాలకు చెందిన సన్నపురెడ్డి రమణమ్మను వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎంపిక చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులందాయి. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జునకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.

మిత్రుడికి చేదోడుగా నిలిచిన స్నేహితులు



శ్రీనివాసరావుకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

సంతనూతలపాడు: 1992–93 టీటీసీ బ్యాచ్ మిత్రుడు బుచ్చిరాజు శ్రీనివాసరావు డయాలసిస్‌తో బాధపడుతున్నాడనే విషయం తెలుసుకుని అతని స్నేహితులు ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. మైనంపాడు డైట్ కాలేజీలో ఉపాధ్యాయ శిక్షణ తీసుకున్న స్నేహితులు పి.మురళీకృష్ణ, ఎండ్లూరి శ్రీను, ఎం.రవిచంద్ర, వి.వెంకటేశ్వరరెడ్డి, ఎల్.పి.రోజ్‌లీనా ఆదివారం శ్రీకాకుళం నుంచి వచ్చి మైనంపాడులో శ్రీనివాసరావును పరామర్శించి రూ.65,000 ఆర్థికసాయం అందజేశారు. వారికి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పామూరు: శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిరమిడ్ ధ్యానకేంద్ర నిర్వాహకుడు గుత్తి రమణయ్య, పందిటి అల్లూరయ్య అన్నారు. స్థానిక పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాఖాహారం ఆవశ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పౌష్టిక విలువలతో కూడిన శాఖాహారమే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ర్యాలీలో సోమిశెట్టి మాల్యాద్రి, పి.తిరుపతిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొండపి: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో అంబేద్కర్ బొమ్మ వద్ద యోగ శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో చక్కటి ఆరోగ్యం, శరీర ధృఢత్వం లభిస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతాయన్నారు. నోడల్ ఆఫీసర్ అనూష, తహసీల్దార్ మురళి, ఆర్‌పీ అశోక్, సచివాలయ సిబ్బంది, యోగ శిక్షకుడు గుండా హరి, సత్యనారాయణ సురేష్ తదితరులు పాల్గొన్నారు.





పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన చెట్లు



శ్రీశైలం రోడ్డులో ఏర్పాటు చేసిన పిల్లల పార్కు

అడవిలో.. ఆహ్లాదం !

- ముచ్చటగొలిపే చిన్నారుల పార్కు
- సకల సౌకర్యాలతో ఏర్పాటు చేసిన అటవీశాఖ
- రెండేళ్ల క్రితం కడియం నుంచి మొక్కలు
- త్వరలోనే ప్రారంభిస్తామన్న అటవీశాఖ అధికారులు

పెద్దదోర్నాల: ప్రకృతి అందాలకు నల్లమల అటవీ ప్రాంతం నెలవు. పర్యాటకులు, భక్తులు కాసేపు సేద తీరేందుకు అటవీశాఖ పచ్చని పార్కులు ఏర్పాటు చేసింది. శ్రీశైలం రోడ్డులోని గణపతి చెక్ పోస్టు వద్ద సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన పార్కులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. సువిశాల అటవీశాఖ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన చిన్న పిల్లల పార్క్‌తో పాటు యువకులు వ్యాయామం చేసుకునేందుకు అనువుగా ఓపెన్ జిమ్ సైతం సిద్ధంగా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని ఉన్న అటవీశాఖ భూముల్లో పార్కులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం కడియం నర్సరీల నుంచి తెచ్చిన మొక్కలు ఈ పాటికే పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆయా చెట్ల మధ్యలోని ఓ భాగంలో ఆరు సీట్లతో కూడిన రౌండ్ రోలర్, రోలర్‌లతో కూడిన జారుడు బల్ల, స్ప్రింగ్‌లతో కూడిన బాతులు, కార్లు, చెక్క గుర్రాలు, అందమైన ఇనుప ఊయలలతో పాటు చైన్లతో ఏర్పాటు చేసిన ఊయలలతో చిన్న పిల్లల పార్కును ఏర్పాటు చేశారు. మరో భాగంలో ఎయిర్ డబుల్ వాకర్, రోవర్ మెషిన్, ట్రిపుల్ టిస్టర్, లెగ్ ప్రెస్ డబుల్, సైకి వాకర్, క్రాస్ ట్రైనర్, స్పిన్నర్ వీల్ తదితర జిమ్‌కు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేశారు. పనస, మామిడి, కొబ్బరి, సిలోన్ కొబ్బరి, ఉసిరి, నేరేడు, పారిజాతం, కదంబ, నాగమల్లి, నల్లమద్ది తదితర ఆకర్షణీయ మొక్కలతో సుందరంగా పార్కులను అందంగా తీర్చిదిద్దారు.

ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజి అధికారి జీవన్ కుమార్ మాట్లాడుతూ త్వరలోనే పార్కులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.



జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు



రోలర్లతో కూడిన జారుడు బల్ల

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి. విజయలక్ష్మి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాల, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కానుకలు సమర్పించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తీపేకల్పవల్లిగా పిలువబడే అమ్మవారిని సందర్శించడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు జంతువులను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలను భక్తులు, మల్లికార్జునస్వామి వారిని పూజించారు. ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె .గురుబ్రహ్మం, ఏఆర్ కె .ప్రసాద్ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాన్ని పర్యవేక్షించారు.

పోలేరమ్మకు పూజలు చేసిన ఎమ్మెల్యే



పోలేరమ్మకు మొక్కు తీర్చుకునేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పెద్దదోర్నాల: స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మండల పరిధిలోని చింతల అగ్రహారంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు దండా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే మండల పరిధిలోని ఐనముక్కలలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, సర్పంచ్ పిక్కిలి కోటిలింగం, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, యక్కంటి లింగారెడ్డి, గొలమారి రాజశేఖర్‌రెడ్డి, బొగ్గరపు రమేష్, చిట్యాల యోగిరెడ్డి, కోడి నాగరాజు, దండా సుబ్బారెడ్డి, లాలూ నాయక్, కర్రా మల్లారెడ్డి, దుగ్గెంపూడి వెంకట నారాయణరెడ్డి, దండా సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి పూజలు



ప్రత్యేక అలంకారంలో అభంజనేయస్వామి



అలంకరణలో నాగమయ్య పుట్ట

పెద్దారవీడు: మండలంలో ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన వీరనాగ అభయంజనేయస్వామికి భక్తి శ్రద్ధలతో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, పూలమాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం, గణపతి పూజ, తమలపాకు పూజ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, తమలపాకు, నిమ్మకాయల, పూలమాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. నాగమయ్య పుట్టకు మహిళలు పాలు, పండ్లు సమర్పించి కుంకుమ, పసుపు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కులు ఉన్న మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామి, నాగమయ్య పుట్ట చుట్టు ప్రదక్షిణలు పొంగళ్లు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, నాగమయ్య పుట్టను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మిస్సింగ్ కేసును ఛేజించిన పోలీసులు

తాళ్లూరు: కుమార్తె కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును ఛేదించారు. ఎస్సై ఎస్ మల్లికార్జున్‌రావు వివరాల మేరకు.. మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన సంఘం చక్రధర్ కుమార్తె ఈ నెల 18వ తేదీన కనిపించడం లేదని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆ అమ్మాయి వారి బంధువుల వద్ద ఉందని శనివారం పోలీసులు గుర్తించారు. అనంతరం ఆమెను ఒంగోలులోని చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించారు. తల్లిదండ్రులు అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, ఈ కారణంతోనే ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పొన్నలూరులో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: వాహనదారులు నిబంధనలు అతిక్రమించి నడిపితే చర్యలు తప్పవని ఎస్సై కె అనూక్ హెచ్చరించారు. రహదారి భద్రతలో భాగంగా పొన్నలూరులో ఆదివారం ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహన డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కట్టెలు, పొగాకు చెక్కుల లోడుతో వెళ్లే ట్రాక్టర్లు సైడ్ డోర్లు తీసి వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

దివ్యాంగుల పిల్లలను గుర్తించాలి



దివ్యాంగ చిన్నారుల సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ రమాదేవి

దర్శి(కురిచేడు): దివ్యాంగుల పిల్లలను గుర్తించి.. భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈవో బీ రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రం దర్శిలో రిసోర్స్ పర్సన్‌లు సేర్వే చేస్తున్న ప్రాంతాలను తనిఖీ చేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులకు, రిసోర్స్ ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాలకు తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ విధంగా తీసుకొనివచ్చిన తల్లిదండ్రులకు రవాణా చార్జీలు, ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం రూ.3 వేలు చెల్లిస్తుందని, అదేవిధంగా ఉపకరణాలు, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందజేస్తారని తెలిపారు. 21 రకాల వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తిస్తారని చెప్పారు. సర్వే పూర్తయిన తరువాత గ్రహణ మొర్రి, గ్రహణ శూల వంటి తేలికపాటి శస్త్ర చికిత్సలు ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు ఎం శ్రీనివాసులు, జి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారి గ్రామోత్సవం

కురిచేడు: స్థానిక జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయం సమీపంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నాగమ్మతల్లికి అభిషేకాలు, అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి వార్షికోత్సవం

కొండపి: మండలంలో కొండపి పంచాయతీ కట్టవారిపాలెంలో ఆదివారం పోలేరమ్మ తల్లి 12వ వార్షిక వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక స్వామి, నాంచారమ్మ, దేవత సమేత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గ్రామస్తులు అమ్మవారికి సద్ది, పసుపు నీరు తీసుకొని ఊరేగింపుగా గుడి దగ్గరకు వచ్చి సమర్పించారు. కట్టవారిపాలెం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులను సన్మానిస్తున్న సంఘు నాయకులు

దర్శి(కురిచేడు): పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించి సత్కరించారు. ఆదివారం మండల కేంద్రం దర్శిలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కంచర్ల శ్రీనుబాబు, రామేశ్వరాచారిల సమక్షంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు దాతల సహకారంతో ప్రోత్సాహక నగదు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతివృత్తులతో పాటు అన్ని రంగాల్లో విశ్వ బ్రాహ్మణ విద్యార్థులు అభివృద్ధి చెందాలని, అందుకు విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణ సంఘాలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ బీసీ కమిషన్ సభ్యులు కుందుర్తి గురవాచారి, ఎసీఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటి కమిషనర్ కే శ్రీనివాసులు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, పల్నాడు జిల్లా సీఐ ముళ్లపూడి రాజా, బీజేపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బంగారు బాబు, విశ్వబ్రాహ్మణులు హాజరయ్యారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

సంతనూతలపాడు: వారంతా పాతికేళ్ల క్రితం కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు. ఆ తర్వాత ఉన్నత విద్య, ఉద్యోగాలతో బిజీ అయిపోయారు. సరిగ్గా 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఆదివారం కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంతనూతలపాడు మండల కేంద్రంలోని ఎస్ఎస్కేసీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి పూర్తి చేసుకున్న బ్యాచ్ విద్యార్థులు సరిగ్గా 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్కడెక్కడో దేశవిదేశాలలో ఉంటున్న పాతమిత్రులంతా తరలివచ్చారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులందరితో సరదాగా రోజంతా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి గురువులు బసవయ్య, కోటిలింగం, పోలయ్య, ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, కొండయ్య, నాగేశ్వరరావు, ప్రసాదరావు, బంగారు కొండలును సన్మానించుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా టి.శ్రీలత, డి.ప్రకాశం, ఎం.కృష్ణ, డి.నరసింహారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.రమణయ్య, బి.నాగార్జున, ఎస్.సాలు బాబు, జి.భాను, పి.రమేష్, కె.సుధాకర్, విద్యాసాగర్, తదితరులు వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, అభిషేకం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన, అభిషేకం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం భజం త్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొండారెడ్డి

కొండపి: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేలా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, సమరశీల ఉద్యమాలతో ప్రతిఘటించాలనీ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వార్సోత్సవాల్లో భాగంగా పెరిదేపి సచివాలయం సెంటర్‌లో కోలాటం, కళారూపాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య త్యాగపూరితమైన, ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారన్నారు. మోడీ ప్రభుత్వం తెస్తున్న జాతీయ నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని 13 నెలలకు పైగా ఢిల్లీ సడ్డిబొడ్డున రైతులు చేసిన పోరాటానికి చట్టాలను వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు మళ్లీ ఆ చట్టాలను దొడ్డిదారిన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, నాయకులు అంగలకుర్తి చిన్నబ్రహ్మయ్య, మల్లెల చిన్న పేతురు, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య పాల్గొన్నారు.